సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



అటూఇటుగా కాలం...

అన్నదాతలకు ఈ ఏడాది మోదం..ఖేదంలా మారింది. వరి సాగు ఆశాజనకంగా ఉండగా, పత్తి పంట దెబ్బతీసింది.

8లో



స్వెట్టర్లు.. వెచ్చని నేస్తాలు

కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి పెరిగింది. దీంతో పలువురు రక్షణకు స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్నారు.

9లో

గరిష్టం / కనిష్టం

31° / 17°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున అంతరాలయంలోని మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని పల్లకీ సేవగా బేడా మండపంలో కొలువు దీర్చారు. స్వామివారికి ఆలయ అర్చకులు ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణతో నిత్యకల్యాణ క్రతువును కనుల పండువగా జరిపారు.

వ్యాక్సినేషన్ వందశాతం పూర్తిచేయాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంరూరల్ : లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్‌నాయక్ సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్యసిబ్బందితో మాట్లాడారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వందశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. నిక్షయ శివిర్ కార్యక్రమంలో భాగంగా అనుమానితులకు క్షయ పరీక్షలు నిర్వహించాలని, సికిల్ సెల్ ఎనీమియా కార్డుల పంపిణీ వందశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. వైద్యాధికారి డాక్టర్ హరీష్, ఎం.వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ రామచందు, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి కళాకారుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న బొమ్మెర జగన్మోహన్

టేకులపల్లి: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ గాన కోకిల అవార్డులను ప్రకటించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 50 మందిని ఎంపిక చేసి, అవార్డులు అందించగా, వారిలో టేకులపల్లికి చెందిన బొమ్మెర జగన్మోహన్ ఉన్నారు. ప్రజా కళాకారుడిగా పేరున్న జగన్ పదేళ్లపాటు ధూంధాం బృందంలో పని చేశాడు. మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా శనివారం జగన్మోహన్‌ను పలువురు అభినందించారు.

పోస్టల్ సేవలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్ర స్వామి

పాల్వంచ: పోస్టల్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ (ఎస్పీ) వి.వీరభద్ర స్వామి అన్నారు. శనివారం స్థానిక పోస్టాఫీస్‌లో నిర్వహించిన సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ తపాల ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్‌శాఖ ద్వారా అమలు చేస్తున్న తక్కువ ప్రీమియంతో అందే జీవిత బీమా పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పాల్వంచ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.వీరన్న, ఐపీపీబీ మేనేజర్ సంజయ్, ఓవర్సీస్ దుర్గా ప్రసాద్ పాల్వంచ సబ్ పోస్ట్ మాస్టర్ నాగ మణిషా, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బండి ఎల్లారావు, తిలక్, రామారావు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో తుపాకుల గర్జన



తెలంగాణలో ఏకైక మావోయిస్టు ప్రభావిత జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడవుల్లో ఈ ఏడాది తుపాకులు గర్జించాయి. రెండు ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మరోవైపు పలువురు మావోయిస్టులు, సానుభూతిపరులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

రివైండ్ 2024

ఏడాదిలో రెండు ఎన్‌కౌంటర్లు

- ఏడుగురు మావోయిస్టులు మృతి
- పదుల సంఖ్యలో మావోల లొంగుబాటు

జిల్లాలోకి మావోలు..

మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ చివరి దశకు చేరుకుని మిషన్ కగార్‌గా మారింది. దీంతో దండకారణ్యంలో భద్రతా దళాలు మెరుపు వేగంతో చొచ్చుకుపోతున్నాయి. ప్రతీ ఆరు కిలోమీటర్లకు ఒకటి వంతున క్యాంపులను ఏర్పాటు చేస్తూ మావోలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఓ వైపు ప్రభుత్వ భద్రతా దళాలతో పోరాటం చేస్తూనే మరోవైపు సరికొత్త షెల్టర్ జోన్ల వెతుకులాటలో పడ్డారు మావోయిస్టులు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా, బీజాపూర్ జిల్లాలతో సరిహద్దు పంచుకుంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేశారు. కరోనా సంక్షోభం ముగిసి సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటి నుంచీ ఈ ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. సరిహద్దులో పోలీసు నిఘా పకడ్బందీగా ఉండటంతో మావోల ప్రయత్నాలు అంతగా సఫలం కాలేదు.

రెండు ఎన్‌కౌంటర్లు

రెండేళ్ల క్రమ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామారాజు డివిజన్‌కు అనుబంధంగా పని చేసే మణుగూరు – పాల్వంచ ఏరియా దళాలు జిల్లాలోకి అడుగు పెట్టగలిగాయి. మొత్తం పదిహేను మంది మావోలు జిల్లాకు వచ్చినట్టు ప్రచారం జరిగింది. మావోల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా వ్యూహంతో జూలై 25న గుండాల మండలం దామరతోగు అడవుల్లో నక్సలైట్ దళాలను చుట్టుముట్టారు. ఇక్కడ జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు చనిపోగా మిగిలిన వారు తప్పించుకున్నారు. అప్పటి నుంచి మావోయిస్టు దళాలపై పోలీసులు మరింత నిఘా పెట్టారు. చివరకు సెప్టెంబరు 5న కరకగూడెం మండలం మోతె అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఆగురుగు మావోయిస్టులు చనిపోగా ఓ మావోయిస్టు తప్పించుకున్నాడు. ఆ తర్వాత ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో ఏడుగురు చనిపోవడంతో జిల్లాలో దళాల సంచారం మరోసారి సద్దుమణిగినట్టయ్యింది.

వరుస లొంగుబాట్లు

ఓ వైపు మావోయిస్టు దళాల కదలికలపై గట్టి నిఘా పెట్టిన పోలీసులు మావోయిస్టు సానుభూతిపరులు, మద్దతుదారుల సమస్యలపై దృష్టి సారించారు. ముఖ్యంగా ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో వలస ఆదివాసీగూడేల్లో తరచూ పర్యటించడం, రోడ్లు వేయించడం, పాఠశాలలకు మరమ్మతులు చేయించడం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేస్తున్నారు. దీంతో నాగరిక జీవితాలకు దూరంగా ఉండే వలస ఆదివాసీ గూడెలకు ప్రభుత్వ పథకాలు చేరువయ్యేందుకు ఆస్కారం కలిగింది. ఆదివాసీల్లో భరోసా కల్పించడంలో సక్సెస్ అయ్యారు. గడిచిన ఏడాది కాలంగా మావోయిస్టులు, మద్దతుదారులు లొంగుబాట పట్టి జనజీవన ప్రవంతిలో కలిసిపోవడానికి మొగ్గు చూపుతున్నారు.

తగ్గని ఉద్రిక్తత

కేంద్రం, మావోయిస్టుల మధ్య జరుగుతున్న పోరు తారాస్థాయికి చేరుకోవడంతో దండకారణ్యంతో సరిహద్దు పంచుకుంటున్న భద్రాద్రి జిల్లాలో ఇప్పటికీ ఉద్రిక్త పరిస్థితులే ఉన్నాయి. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జాయింట్ టాస్క్ ఫోర్స్ యూనిట్‌ను జిల్లాలో ఏర్పాటు చేయాలని కేంద్ర హోంమంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కోరారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల సరిహద్దులో ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల క్యాంపులపై మావోయిస్టులు దాడులకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఛత్తీస్‌గఢ్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా పడకుండా నిరోధించడంలో పోలీసులు సఫలమవుతున్నారనే అభిప్రాయం నెలకొంది.

సర్వే పారదర్శకంగా ఉండాలి

- వివరాలు ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్



బూర్గంపాడు: వేపలగడ్డలో సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్

బూర్గంపాడు/దుమ్ముగూడెం: ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ ఆదేశించారు. బూర్గంపాడు మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామంలో, దుమ్ముగూడెం మండలం డి. కొత్తగూడెం గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొబైల్ యాప్‌లోదరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. అన్ని డాక్యుమెంట్లను పొందుపరచాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని దరఖాస్తుదారులకు సూచించారు. దళారుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. సర్వేలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల రావు, తహసీల్దార్లు ముజాహిద్, అశోక్‌కుమార్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ రామకృష్ణ ఆర్‌ఐలు నర్సింహారావు, వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శులు బిందుష, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో...

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతో పాటు జ్ఞాపికను అందజేశారు. తొలుత వేద పండితులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు.



రామయ్య సన్నిధిలో కుటుంబ సమేతంగా వీపీ గౌతమ్

ఏసీబీ వలలో సర్వేయర్

- సర్వే రిపోర్టుకు లంచం డిమాండ్
- రూ. 50 వేలు తీసుకుంటూ పట్టుబడిన రెవెన్యూ ఉద్యోగి



ఏసీబీ అధికారులకు పట్టుబడిన దమ్మపేట మండల రెవెన్యూ సర్వేయర్

దమ్మపేట : భూ సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన మండల రెవెన్యూ సర్వేయర్‌ను అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ వై.రమేష్ నేతృత్వంలో శనివారం అరెస్ట్ చేశారు. ఏసీబీ డీఎస్పీ కథనం ప్రకారం... మండలంలోని జమేదారు బంజర రెవెన్యూ పరిధిలో ఓ మహిళకు చెందిన 17 ఎకరాల 20 గుంటల భూమికి ధరణిలో డిజిటల్ సైన్ కాలేదు. దీంతో పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు కాలేదు. ఆమె పట్టాదారు పాస్ పుస్తకం కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోగా భూమిని సర్వే చేయడానికి మండల రెవెన్యూ సర్వేయర్ మెరుగు వెంకటరత్నం వచ్చారు. సర్వే రిపోర్ట్ తయారు చేశాక, ఆ రిపోర్టును కార్యాలయంలో అందజేసేందుకు రూ.1,50,000 డిమాండ్ చేశారు. దీంతో దరఖాస్తుదారురాలి సోదరుడు రెండుసార్లు కొంతమొత్తం డబ్బులు ఇచ్చినా కార్యాలయంలో రిపోర్టు సమర్పించలేదు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయగా బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు రూ. 50 వేలు ఇస్తామని బాధితులు ఫోన్ చేయగా, నగదు తీసుకుని గాంధీనగర్ గ్రామ శివారుకు రావాలని సర్వేయర్ సూచించారు. నగదు సర్వేయర్‌కు ఇవ్వగానే ఏసీబీ డీఎస్పీ తన బృందంతో కలిసి సర్వేయర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విచారణ జరిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, అవినీతి నిరోధక శాఖకు 1064 నంబర్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

వివేకానందుడి స్ఫూర్తితో జాతి జాగృతం

- రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ
- సత్తుపల్లిలో మొదలైన తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం



ర్యాలీలో ఎమ్మెల్యే రాగమయి, స్వామిజీలతో విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప బహుమతి స్వామి వివేకానందుడని, ఆయన ప్రపంచానికే జ్ఞానభిక్ష పెట్టిన మహనీయుడని హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ తెలిపారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యావత్ జాతి జాగృతం కావాలని సూచించారు. సత్తుపల్లిలో శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన తెలుగురాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమ్మేళనంలో భాగంగా తొలుత స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి వేలాది మంది విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని స్వామిజీలతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. అనంతరం జరిగిన విద్యార్థి సమ్మేళనంలో బోధమయానందజీ మాట్లాడారు. భారతదేశ ఖ్యాతిని వివేకానందుడు ప్రపంచానికి చాటారని, ఆయన స్ఫూర్తితో యువత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఏకాగ్రతతోనే సంకల్ప సాధన

విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడానికి విద్యాసంస్థల్లో అభ్యాసన చేయించాలని విజయవాడ రామకృష్ణ మిషన్ నిర్వాహకులు స్వామి శితికంఠానంద తెలిపారు. తద్వారా వారు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికి మార్గం ఏర్పడుతుందని చెప్పారు. శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, గౌతమబుద్ధుడు వంటి మహనీయులు పుట్టిన ఈ దేశంలో వారి వారసులుగా ఏకాగ్రతను పెంచుకోవడం తప్పనిసరి అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ.. తనకు చిన్నతనం నుంచే పుస్తకపఠనం ఇష్టమని, వివేకానంద, రామకృష్ణ పరమహంస సాహిత్యాలతో పాటు భారతం, రామాయణం చదివానని తెలిపారు. మారుమూల పల్లెటూరులో పుట్టినప్పటికీ డాక్టర్ కావాలనే లక్ష్యంతో చదివి అనుకున్నది సాధించానని చెప్పారు. అపజయాలకు కుంగిపోకుండా పనిచేస్తే విజయం సొంతమవుతుందన్నారు. మనస్సులో దైవత్వాన్ని నింపడమే అన్ని మతాల సారాంశమని ఆమె పేర్కొన్నారు. అనంతరం శ్రీరామకృష్ణ వివేకానంద భావజాలం, చరిత్రకు సంబంధించి ఇచ్చిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే, స్వామిజీ జీవిత చరిత్రపై నిర్వహించిన పరీక్షలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, చల్లగుళ్ల అప్పారావు, నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, డాక్టర్ మట్టా దయానంద్, తోట సుజలారాణి, దోమ ఆనంద్‌బాబు, రామిశెట్టి సుబ్బారావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, గాదె చెన్నారావు, చళ్లగుండ్ల కృష్ణయ్య, పులి శ్రీనివాసరావు, ప్రవీణ్‌రెడ్డి, కమల్‌పాషా, పద్మజారెడ్డి, కంటే నాగలక్ష్మి, చల్లారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు వామపక్షాల నిరసన



సమావేశానికి హాజరైన వామపక్ష నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 30న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. శనివారం కొత్తగూడెంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వామపక్షాల ఉమ్మడి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవహేళన చేసేవిధంగా ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అంబేద్కర్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. వామపక్షాల జాతీయ కమిటీల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల సీపీఎం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మచ్చా వెంకటేశ్వర్లును వామపక్షాల పార్టీల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, వామపక్ష నాయకులు ముత్యాల విశ్వనాథం, కంచర్ల జమలయ్య, బానోత్ ధర్మ, ఏదులాపురం గోపాల రావు, పెద్ద బోయిన సతీష్, అలీమొద్దీన్, రేపాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా వాలీబాల్ టోర్నీ

- బాలబాలికల విభాగాల్లో వరంగల్, ఖమ్మం జట్ల ముందంజ
- నేడు ముగియనున్న రాష్ట్రస్థాయి పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఖమ్మం డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి



నిజామాబాద్ - కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ టోర్నీలో భాగంగా పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు శనివారం రెండో రోజుకు చేరగా, పాత పది జిల్లాల నుంచి హాజరైన బాలబాలికల జట్లు లీగ్ దశలో సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నాయి. లీగ్ మ్యాచ్‌ల్లో భాగంగా బాలబాలికల విభాగాల్లో వరంగల్, ఖమ్మంతో పాటు నల్లగొండ, నిజామాబాద్ జట్లు ముందంజలో నిలిచాయి. మ్యాచ్‌లను ఖమ్మం డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించగా కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ, ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, వి.నరేష్, రిఫరీలు ఐ.పవన్‌కుమార్, భద్రం, షఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు మ్యాచ్‌ల ఫలితాలు...

బాలుర విభాగం లీగ్ మ్యాచ్‌లో పూల్ 'ఏ' నుంచి ఖమ్మం – ఆదిలాబాల్ జట్లు తలపడగా ఖమ్మం జట్టు 25–23, 25–16, 25–23 వరుస సెట్లతో విజయం సాధించింది. అనంతరం మెదక్ – నల్లగొండ మ్యాచ్‌లో మెదక్, వరంగల్–మెదక్ నడుమ మ్యాచ్‌లో వరంగల్ జట్టు గెలిచింది. పూల్ 'బీ'కి వచ్చేసరికి మహబూబ్‌నగర్ – నిజామాబాద్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, కరీంనగర్ – హైదరాబాద్ మధ్య మ్యాచ్‌లో కరీంనగర్, రంగారెడ్డి – హైదరాబాద్ జట్ల నడుమ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. ఇక బాలికల విభాగం పూల్ 'ఏ'లో నల్లగొండ–హైదరాబాద్ మ్యాచ్‌లో నల్లగొండ, ఖమ్మం–రంగారెడ్డి మధ్య మ్యాచ్‌లో ఖమ్మం, నిజామాబాద్ – రంగారెడ్డి నడుమ పోటీలో నిజామాబాద్ గెలిచింది. పూల్ 'బీ'లో ఆదిలాబాద్ జట్టుపై వరంగల్, మెదక్ జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించాయి. కాగా, ఆదివారం రాష్ట్ర స్థాయి టోర్నీ ముగియనుంది.

క్లుప్తంగా

నేటి నుంచి నెహ్రూ క్రికెట్ కప్

భద్రాచలంటౌన్: భద్రాద్రి వేదికగా అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభం కానుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 29వ నెహ్రూ కప్ తాళ్లూరి భారతీదేవి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. టోర్నీకి వివిధ రాష్ట్రాల నుంచి 21 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మైదానంలో టెంట్లు వేయడమే కాక నలుమూలల నుంచి మ్యాచ్‌లు వీక్షించేలా భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కాగా, పోటీలను ఆదివారం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ సభ్యులు, ఐటీసీ అధికారులు ప్రారంభిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

కొత్తగూడెం ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



సత్యనారాయణకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో షుగర్ బాధితుడికి వైద్యులు శనివారం అరుదైన ఆపరేషన్ (స్ప్లిట్ స్కిన్ గ్రాఫ్ట్) నిర్వహించారు. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన సత్యనారాయణ ఎడమకాలిపై గాయం ఉండగా, ఇన్‌ఫెక్షన్ ఎక్కువవడంతో నెలకిందట ఆస్పత్రిలో చేరాడు. అయితే, గాయం మానినా అక్కడ చర్మం రాలేదు. దీంతో వైద్యులు సత్యనారాయణ కుడి తొడ పైనుంచి చర్మం తీసి గాయం మానని చోట సర్జరీ ద్వారా అతికించారు. వైద్యులు సుధాకర్, రాంప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయకుమార్, అనస్తీషియన్ తేజావత్ రమేశ్, సిబ్బంది అరుణ, రాజేశ్, అనిల్ ఈ శస్త్రచికిత్సలో పాల్గొనగా అధికారులు అభినందించారు.

భద్రతా బలగాలకు తప్పిన ముప్పు

దుమ్ముగూడెం: భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన 20 కేజీల అతిపెద్ద రెండు ఐఈడీ బాంబులను బలగాలు గుర్తించి నిర్వీర్యం చేయడంతో పెను ముప్పు తప్పింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా, పోలంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జోర్నపాల్ నుంచి జాగరగుండ వెళ్లే రహదారికి సమీపంలో మావోయిస్టులు అమర్చిన 20 కిలోల 2 ఐఈడీ బాంబులను భద్రతా బలగాలు గుర్తించాయి. వెంటనే స్వాధీనం చేసుకుని వాటిని నిర్వీర్యం చేశారు. ఆ ఐఈడీ విస్ఫోటనం చెందితే బలగాలకు భారీగా ప్రాణహాని జరిగేది.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రమేశ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్ హెచ్చరించారు. టూటౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని చెప్పారు. టూటౌన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం పెట్రోలింగ్ ఉంటుందని, పెట్రోలింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

ముగ్గురిపై కేసు

పాల్వంచరూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్రవాహనదారుడిపై దాడిచేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బస్వతారక కాలనీకి చెందిన గుర్రం ఆనంద్ ఈ నెల 25వ తేదీ రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సోములగూడెం క్రాస్ రోడ్డు వద్ద మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా బస్వతారకకాలనీకి చెందిన మాలోతు సాయి, యశ్వంత్, గణేశ్ తనపై దాడి చేశారని శనివారం ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిచేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

దుకాణంలో చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం జీపీ అన్నారం గ్రామానికి చెందిన గడ్డం గురువయ్య దుకాణంలో శనివారం చోరీ జరిగింది. రోడ్డు పక్కనే దుకాణం నిర్వహిస్తున్న గురువయ్య.. అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశాడు. కోళ్లు కూడా కొనుగోలు చేసేందుకు నగదు సిద్ధం చేసుకొని దుకాణంలో పెట్టాడు. శనివారం ఉదయం దుకాణానికి వేసిన తాళం పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకుని, నగదు, రూ.లక్ష విలువ చేసే సామగ్రి చోరీకి గురైనట్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

అటూఇటుగా కాలం..

లెక్కకు మించి వానలు.. లక్ష్యం మేర పంటల సాగు

- వరికి మద్దతు ధర, బోనస్‌తో అన్నదాతల్లో ఆనందం
- పత్తికి ప్రతికూలం, మిర్చిని వీడని తెగుళ్లు
- భారీ వర్షాలతో పలుచోట్ల దెబ్బతిన్న పంటలు
- వడివడిగా యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతులు



ఆశాజనకంగా ఉన్న వరి

అన్నదాతలకు ఈ ఏడాది కొంత మోదం.. ఇంకొంత ఖేదం అన్నట్లుగా సాగింది. జూన్ మొదలు సెప్టెంబర్ వరకు సాధారణానికి మించి వర్షాలు కురిశాయి. ఇక సెప్టెంబర్‌లో రెట్టింపు వర్షపాతం నమోదైంది. జూన్‌లో కురిసిన వర్షాలకు పత్తి సాగు సకాలంలో మొదలుకాగా పెసర, కంది వంటి విత్తనాలు కూడా నాటారు. అంతేకాక భూగర్భ జలాలు పెరగడం, జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో వరి సాగు అంచనాలను మించింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 5,53,813 ఎకరాల్లో సాధారణ పంటలు, ఉద్యాన పంటలు 1,64,711 ఎకరాల్లో సాగయ్యాయి. గతంతో పోలిస్తే అన్నీ కలిపి సాగు విస్తీర్ణం పెరిగినా పత్తి మాత్రం కాస్త తగ్గింది. ఈ స్థానంలో వరి విస్తీర్ణం పెరిగింది. ఈమేరకు 2024 ఖరీఫ్‌లో అన్నదాతలు ఆశలు ఏ మేర ఫలించాయో ప్రత్యేక కథనం.

– సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఖమ్మంవ్యవసాయం

ఖరీఫ్‌లో సాగైన ప్రధాన వ్యవసాయ, ఉద్యాన పంటలు

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	1,60,332
మొక్కజొన్న	41,503
పత్తి	1,56,212
కంది	5,825
మిర్చి	17,339
చెరకు	1,273
వేరుశనగ	1,871
జీలుగు	28,185
ఆయిల్‌పామ్	37,053
కూరగాయలు	481
ఇతర పంటలు	48,496

దెబ్బతీసిన భారీ వర్షాలు

2024 రివైండ్

ఆగస్టు 31 నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురవగా మునుపెన్నడూ లేని విధంగా వర్షపాతం నమోదైంది. దీంతో పంటలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల పంట పొలాలు ఆనవాళ్లు కోల్పోయి ఇసుక, రాళ్ల మేటలు వేశాయి. కూసుమంచి, మధిర వ్యవసాయ డివిజన్లతో పాటు పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోనూ పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాలో 27,616 మంది రైతులకు చెందిన 28,179 ఎకరాల్లో పంటల నష్టం జరిగినట్లు గుర్తించగా, ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.28,17,91,500 పరిహారం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 1,232 మంది రైతులు 5,582 ఎకరాల్లో పంటలు నష్టపోయారు.



అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి (ఫైల్)

పత్తి.. దిగుబడి తగ్గి

ఈ ఏడాదీ పత్తికి ప్రతికూలతే ఎదురైంది. అధిక వర్షాలు, తగ్గిన దిగుబడి, ధర లేకపోవటం రైతులను కుంగదీశాయి. ఆగస్టు చివరి వారం నుంచి కురిసిన వర్షాలతో పైర్లు ఎర్రబడ్డాయి. దీంతో ఎకరాకు దిగుబడి 10 క్వింటాళ్ల నుంచి ఐదు క్వింటాళ్లకు పడిపోయింది. మద్దతు ధర రూ.7,521గా ఉంటే రైతులకు రూ.5వేల నుంచి రూ. 6 వేలకు మించి దక్కక తీవ్రంగా నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులకు ప్రయోజనం కలగలేదు.

మిర్చిని వీడని తెగుళ్లు

మిర్చికి ఈసారి కూడా తెగుళ్ల బెడద తప్పటం లేదు. తామర పురుగు వేధిస్తోంది. పురుగు మందులు వాడి తెగుళ్లను నియంత్రించినా ఊహించని విధంగా పంట ధర తగ్గుతోంది. గతేడాది సీజన్‌లో రూ.20 వేలు పలికిన క్వింటా మిర్చి ధర ప్రస్తుతం రూ.16వేలకు మించడంలేదు.

ఆయిల్‌పామ్‌పై ఆసక్తి

నూనెలకు అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌తో ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు ఉండడంతో ఆయన ప్రత్యేక సారించి ప్రోత్సహిస్తున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరిగింది.



వరదలతో పూర్తిగా ధ్వంసమైన పంటలు (ఫైల్)

ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ

ఖమ్మం నుంచిప్రాతినిధ్యం వహిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా ఉండడం మార్కెట్‌కు కలిసొచ్చింది. రాష్ట్రంలో రెండో పెద్ద మార్కెట్ కావటంతో దాదాపు రూ.140 కోట్లతో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు అనుమతులు వచ్చాయి. ఈ పనులు త్వరలోనే మొదలుకానుండగా మార్కెట్ రూపురేఖలు మారిపోనున్నాయి. మిర్చి విక్రయాల కోసం ప్రత్యేక నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు.

వరి అంతా ఓకే...

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంటగా వరి సాగవుతోంది. సన్నధాన్యం సాగు చేస్తే మద్దతు ధరకు తోడు రూ.500 బోనస్ చెల్లిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో పాటు వర్షాలు ఆశాజనకంగా ఉండడం అన్నదాతలకు కలిసొచ్చింది. దీంతో విస్తీర్ణంతోపాటు దిగుబడులూ పెరిగాయి. ఖమ్మం జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 2.82 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాది 2.91లక్షల ఎకరాలకు పెరిగింది. ఇక భద్రాద్రి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,60,332 ఎకరాల్లో వరి సాగైంది. ఎకరాకు 35 బస్తాలకు పైగానే దిగుబడి రావడం రైతులకు సంతృప్తి కలిగించింది.

వడివడిగా యాసంగి

జలాశయాల్లో సమృద్ధిగా నీరు, ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలూ ఉండటంతో రైతులు యాసంగి సాగుపై దృష్టి సారించారు. ప్రధానంగా వరితో పాటు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలుచోట్ల వరి నార్లు పోయగా.. ఇంకొందరు పత్తి స్థానంలో మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ యాసంగిలో ఖమ్మం జిల్లాలో వరి 2.14లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా మొక్కజొన్న 91 వేల ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. ఇక భద్రాద్రి జిల్లాలో గతేడాది యాసంగిలో 60,927 ఎకరాల్లో వరి సాగు కాగా అది ఈసారి 68ఎకరాలకు పెరుగుతుందని అంచనా రూపొందించారు.

రుణమాఫీ అసంపూర్ణం

ప్రభుత్వం రూ.2 లక్షల మేర రుణాలు ఉన్న రైతులకు మాఫీ ప్రకటించింది. ఖమ్మం జిల్లాలో దాదాపు 3.75 లక్షల మంది రూ.4,300 కోట్ల రుణాలు కలిగి ఉండగా నాలుగు విడతల్లో చేసినా 1,33,197 మంది రైతులకు రూ. 926.60 కోట్ల మేర మాఫీ అయ్యాయి. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని విడతల్లో కలిపి 64,187 మంది రైతులకు రూ.464.08 కోట్ల మేర రుణాలు మాఫీ అయినట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది.

వరి దిగుబడి బాగుంది..



ఈ ఏడాది పంటల సాగు బాగున్నా వర్షాలు పత్తిని దెబ్బతీశాయి. పత్తి దిగుబడి లేక ధర రాక నష్టాలు తప్ప లేదు. వరి దిగుబడి బాగుంది. ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వడంతో ప్రయోజనం కలిగింది.

–గుగులోతు రవి, ఉప్పలచెలక, కొణిజర్ల మండలం

భారీ వర్షం దెబ్బతీసింది..



ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో పంటలు కోల్పోయాం. నాలుగెకరాల్లో వరి, పత్తి, మిర్చి పంట ధ్వంసమైంది. మోటార్ కూడా కొట్టుకుపోయింది. ప్రభుత్వం పరిహారం ఇచ్చినా నష్టాన్ని గట్టెక్కలేకపోయాను.

–తేజావత్ వెంకన్న, తుమ్మలతండా, కూసుమంచి మండలం

సంతృప్తికరంగా సాగు



ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలతో పంటల సాగు సంతృప్తికరంగా ఉంది. వరి సాగు విస్తీర్ణం పెరగడమే కాక దిగుబడి, ధర ఆశాజనంగా ఉన్నాయి. అధిక వర్షాలతో పత్తి దిగుబడి కొంత తగ్గింది. మిర్చి ఇప్పటికైతే ఇబ్బంది లేదు.

–ధనసరి పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

ఉపాధ్యాయులు వేధిస్తున్నారు..

వివరాలు వెల్లడించిన తల్లిదండ్రులు



వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నన్నపనేని ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న తమ కుమారుడు కోరుకొండ శామ్యూల్‌నిస్సీకి ఉపాధ్యాయుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు వాపోయారు. శనివారం రాఘవ నిలయం(రెడ్డి సత్రం)లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తల్లిదండ్రులు కోరుకొండ రాజేంద్రప్రసాద్, సాజిత వివరాలు వెల్లడించారు. నన్నపనేని ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో గణితంలో తమ కుమారుడి ప్రోగ్రెస్ సరిగా లేదని అడగడంతో కక్షకట్టిన సదరు ఉపాధ్యాయురాలు వేధింపులకు గురిచేస్తోందని, పాఠశాల హెచ్‌ఎంకు విషయం చెప్పినా ఫలితం లేకుండాపోయిందని, డీఈఓకు పోస్టు ద్వారా ఫిర్యాదు చేశామని చెప్పారు. కానీ, ఎలాంటి స్పందన లేకపోవడంతో సమాచార హక్కుచట్టం ద్వారా ఉపాధ్యాయురాలి వివరాలు అడగడంతో పాఠశాలలోని మరికొందరు ఉపాధ్యాయులు తమ కుమారుడిని కొట్టడంతోపాటు జంతువుల పేర్లతో పిలుస్తూ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖాధికారులు విచారణ జరిపించి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నాటుసారా తయారీ కేంద్రంపై దాడి

బెల్లం, పటిక, నాటుసారా స్వాధీనం



నిందితుడు, బెల్లం, వాహనాన్ని చూపుతున్న అధికారులు

అశ్వాపురం: మండలంలోని పిచుకలపాడు తండా శివారులో ని నాటుసారా తయారీ కేంద్రంపై కొత్తగూడెం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, మణుగూరు ఎక్సైజ్‌స్టేషన్ అధికారులు శనివారం దాడి చే శారు. 108 కేజీల బెల్లం, 5 కేజీ ల పటిక, రెండు లీటర్ల నాటుసారా, అశోక్ లేలాండ్ ట్రక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. పిచుకలపాడు తండాకు చెందిన బాదావత్ కోటేశ్వరరావు, కొత్తగూడెం పెదబజార్‌కు చెందిన సంజయ్‌లడ్డా కొత్తగూడెం నుంచి ముడిపదార్థాలు తీసుకొచ్చి నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నారని, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు గౌతమ్, కిశోర్‌బాబు, సిబ్బంది రామకృష్ణగౌడ్, హబీబ్‌పాషా, గురవయ్య, సుమంత్, రమేశ్, ప్రసన్న, శ్రీను, అమల తదితరులు పాల్గొన్నారు.

సఖి కేంద్రంలో సివిల్ సప్లై అధికారుల తనిఖీ



సఖి కేంద్రంలోని గ్యాస్ సిలిండర్లు

అశ్వారావుపేటరూరల్: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే ఉద్దేశంతో మహిళా సమాఖ్య పర్యవేక్షణలో అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన సఖి కేంద్రంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్ల నిల్వలపై శనివారం సివిల్ సప్లై అధికారులు దాడి చేశారు. మండల కేంద్రంలోని గుర్రాలచెరువు రోడ్‌లో గల 'సఖి' కేంద్రంలో 26 గ్యాస్ సిలిండర్లు, మరో 3 ఖాళీ సిలిండర్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, భారత్ గ్యాస్ గోదాంలో భద్రపరిచామని సివిల్ సప్లై అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు.

ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే మేలు

కారేపల్లి: దేశమంతటా బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు డిమాండ్ చేశారు. కారేపల్లిలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తుండగా, ఇక్కడ మాత్రం ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తూ బీజేపీ అధికారంలోకి వస్తోందని విమర్శించారు. ఇక జమిలీ ఎన్నికల పేరుతో లాభపడాలని బీజేపీ చూస్తోందన్నారు. ఈ విధానం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని తెలిపారు. కాగా, కారేపల్లి – ఇల్లెందు ప్రధాన రహదారిలో వాహనదారుల ఇక్కట్లు తీర్చేలా రైల్వే గేట్ల స్థానంలో ఫ్లై ఓవర్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు భట్టు రాజేందర్‌నాయక్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి బ్యాంకు సేవలకు గుర్తింపు

ఖమ్మంగాంధీచౌక్: భద్రాద్రి అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు సేవలను గుర్తిస్తూ హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ క్వాలిటీ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈమేరకు సర్టిఫికెట్(ఐఎస్‌ఓ సర్టిఫికెట్) అందిన సందర్భంగా శనివారం బ్యాంకు పాలకవర్గం బాధ్యులు సమావేశమయ్యారు. ఈసమావేశంలో చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు, పాలక వర్గసభ్యులు, ఖాతాదారుల సహకారంతో బ్యాంకుకు గుర్తింపు లభించిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న 17 బ్రాంచ్‌లకు తోడు త్వరలో కొత్తగా ఆరు బ్రాంచ్‌లు ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్లు సన్నే ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ సాంబమూర్తి, సీఈఓ దాసరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: మావోయిస్టు పార్టీకి చెందిన పలువురు ఏరియా కమిటీ, దళ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81, 141 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారని ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పెద్దగెల్లూరు గ్రామానికి చెందిన పూనెం పాక్షి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఎర్రంపాడుకు చెందిన వెట్టి దేవ, మడకం ఉంగి, పామేడు పీఎస్, ఇర్రవల్లి గ్రామానికి చెందిన రవ్వ సోను, రాసపల్లి గ్రామానికి చెందిన మడవి గంగి లొంగిపోయినట్లు చెప్పారు. వారిలో పూనెం పాక్షి 2016లో సీఎస్‌ఎం సభ్యురాలిగా మావోయిస్టులలో చేరి, 2018లో దళ సభ్యురాలిగా, 2022లో బాసగూడ ఎల్‌వోఎస్ ఏరియా కమిటీ సభ్యురాలిగా పనిచేస్తోందని, ఆమెపై రూ.4 లక్షల రివార్డు ఉందని, వెట్టి దేవ 2018లో మావోయిస్ట్ పార్టీలో సభ్యుడిగా చేరి పలు విధ్వంసక, హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, ఇతనిపై కూడా రూ.4 లక్షల రివార్డ్ ఉందని పేర్కొన్నారు. మడకం ఉంగి 2018లో సీఎస్‌ఎం సభ్యురాలిగా మావోయిస్ట్ పార్టీలో చేరి, 2019లో చర్ల ఎల్‌వోఎస్‌కు బదిలీ అయ్యి, పలు విధ్వంసక ఘటనల్లో పాల్గొందని, ఈమెపై కూడా రూ.4 లక్షల రివార్డ్ ఉందని, రవ్వ సోమ 2010లో బాలల సంఘంలో సభ్యుడిగా చేరి, 2017 నుంచి 2021 వరకు దళ సభ్యుడిగా పామేడ్ ఏరియా, సౌత్ బస్తర్ డీవీసీలో పనిచేసి పలు ఘటనల్లో పాల్గొన్నాడని, ఇతనిపై రూ.4 లక్షల రివార్డ్ ఉందని, మడివి గంగి 2018లో బాలల సంఘంలో చేరి, 2019లో ఎర్రపల్లి ఆర్‌పీసీలో మిలీషియా సభ్యురాలిగా, పామేడ్ ఎల్‌వోఎస్ దళ సభ్యురాలిగా పనిచేస్తోందని, ఈమెపై రూ.లక్ష రివార్డ్ ఉందని ఎస్పీ వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లి శివారులో శనివారం సాయంత్రం కొందరు పేకాట ఆడుతుండగా ఎస్సై హారిక ఆధ్వర్యాన దాడి చేశారు. ఈసందర్భంగా ఏడుగురు పరారు కాగా ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అంతేకాక రూ.7,380 నగదు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గాయపడిన వలస కార్మికుడు మృతి

బూర్గంపాడు: మోరంపల్లిబంజర వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బిహార్‌కు చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వేపలగడ్డ వద్ద ఓ ఫ్యాక్టరీలో బిహార్ రాష్ట్రంలోని బెల్లారిమిలి ప్రాంతానికి చెందిన సుధీర్‌దాస్, ప్రదీప్‌దాస్‌తో పాటు మరికొందరు వలస కూలీలు పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సుధీర్‌దాస్, ప్రదీప్‌దాస్‌లు మోరంపల్లిబంజరలో జరుగుతున్న వారపుసంతకు కూరగాయలు కొనేందుకు నడుచుకుంటూ వెళ్తున్నారు. వెనుక నుంచి ఓ మోటార్‌సైకిల్ వీరిని వేగంగా ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలిస్తున్న క్రమంలో సుధీర్‌దాస్ (38) మృతిచెందాడు. ప్రదీప్‌దాస్‌ను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై ఉన్న వ్యక్తి కూడా గాయపడగా.. పాల్వంచ తరలించి చికిత్స అందించారు. సుధీర్‌దాస్ మృతి ఘటనపై ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ సూరి సత్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ రాజశేకర్ కథనం మేరకు.. పూనెకు చెందిన అథర్వ అభయభవర్తి (25), రూప్‌చంద్ జగదీశ్ అగర్వాల్‌కు చెందిన టాటా బొలెరో పికప్ వాహన క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ముంబై నుంచి విగ్రహాన్ని తీసుకొని బొలేరోలో కొత్తగూడెం వచ్చారు. అన్‌లోడ్ అనంతరం రాజమండ్రి కిరాయికి పయనమయ్యారు. శుక్రవారం మండలంలోని గంగారం అటవీ ప్రాంతంలో వీరి బొలేరో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. గాయపడిన అథర్వ అభయభవర్తిని 108లో అశ్వారావుపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. మృతుని తండ్రి అభయ్ వసంత్ భవర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

సింగరేణి(కొత్తగూడెం): అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తగూడెం టూటౌన్ పరిధిలోని 12వ వార్డు మోడ్రన్ ఇక్రా పాఠశాల సమీపంలోని శనివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో పండ్ల వ్యాపారం చేసి, ప్రస్తుతం మేషన్ కూలీగా పనిచేసుకుంటూ జీవిస్తున్న భూక్య రవి (34)కి సుమారు రూ.6లక్షల అప్పులయ్యాయి. ఆర్థిక బాధలు తాళలేక శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

పవర్ బ్యాంక్ కొనివ్వలేదని వివాహిత...

అశ్వారావుపేటరూరల్: పవర్‌బ్యాంక్ కొనివ్వలేదని పురుగులమందు తాగి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని బండారుగుంపు గ్రామానికి చెందిన ముచ్చిక లక్ష్మి(22) అదే గ్రామానికి చెందిన ముచ్చిక గంగరాజు రెండో భార్య. శుక్రవారం మధ్యాహ్నం గంగరాజు మొదటి భార్యకు కొత్త సెల్‌ఫోన్ కొనివ్వగా, తాను చాలా రోజుల నుంచి సెల్‌ఫోన్ పవర్ బ్యాంక్ అడిగితే పట్టించుకోలేదని మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగులమందు తాగింది. కుటుంబీకులు గమనించే సరికే శుక్రవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి చెల్లి మడకం చిన్న చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.